క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఆరిలోవ: పైనాపిల్ కాలనీ 33/11 కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జోన్–3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పైనాపిల్ కాలనీ, సీఐడీ కార్యాలయం, కామాక్షినగర్, శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, శ్రీకాంత్‌నగర్, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ, శివాజీనగర్, కనకమహాలక్ష్మినగర్, రాజీవ్‌నగర్, ఆరిలోవ ఆఖరి బస్టాప్, లక్ష్మీనగర్, ప్రగతినగర్, దుర్గాబజార్, పాత పోలీస్ స్టేషన్ ప్రాంతం, పాండురంగాపురం, నెహ్రూనగర్, టీఐసీ పాయింట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఈఈ కోరారు.

'కర్ణ పిశాచి' సినిమాను ఆదరించండి


మీడియా సమావేశంలో చిత్ర యూనిట్

బీచ్ రోడ్డు: డివైన్ అండ్ లవ్ సందేశాలతో ఎస్వీకే డ్రీమ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై నిర్మించి ఈ నెల 27న విడుదల చేస్తున్న కర్ణ పిశాచి సినిమాను ప్రేక్షకులు ఆదరించాలని డైరెక్టర్ విజయ్ మల్లాది కోరారు. పెదవాల్తేరు రామలక్ష్మణ అపార్ట్‌మెంట్ వద్ద గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర పరిసరాల్లోని ప్రకృతి అందాల్లోనే పూర్తిగా సినిమాను చిత్రీకరించినట్లు తెలిపారు. దేవతలను నియమ నిష్టలతో ఆరాధించిన వారికి అంతా మేలు జరుగుతుందని, అలా చేయని వారికి దేవతలు సహకరించరనే ఇతివృత్తంతో ఈ చిత్రాన్ని రూపొందించామన్నారు. ఈ సినిమాను భరత్‌కుమార్ సిగిరెడ్డి నిర్మించగా.. హీరోగా భరత్, హీరోయిన్‌గా ప్రణవి, రమ్య నటించారని చెప్పారు. మ్యూజిక్ డైరెక్టర్‌గా తరుణ్ రాణాప్రతాప్, ప్రతి నాయకుడిగా నిఖిల్, ఎడిటర్‌గా పి.కె.నగేష్, భానుప్రకాష్ తదితరులు పనిచేశారన్నారు.

రెడ్‌క్రాస్ హోమ్‌కు వృద్ధుడు


రెడ్‌క్రాస్ హోమ్ ప్రతినిధికి దయానంద్‌ను అప్పగిస్తున్న ఎస్‌ఐ సురేష్‌కుమార్

బీచ్‌రోడ్డు: నిస్సహాయ స్థితిలో తిరుగుతున్న ఒక వృద్ధుడిని గమనించిన నగర పోలీస్ కమిషనర్ రెడ్‌క్రాస్ హోమ్‌కు అతడిని తరలించాలని సూచించారు. వివరాలిలా.. బిహార్ రాష్ట్రానికి చెందిన దయానంద్ సాహు అనే వృద్ధుడు పిల్లలతో గొడవ పడి విశాఖ చేరుకున్నారు. గురువారం మధ్యాహ్నం సిరిపురంలోని ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద నిస్సహాయ స్థితిలో తిరుగుతున్న అతడిని అటుగా వెళ్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి చూసి మూడో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. స్టేషన్ ఇన్‌చార్జి సీఐ తిరుమల రావు, ఎస్‌ఐ సురేష్‌కుమార్‌లు అక్కడికి చేరుకుని సాహును స్టేషన్‌కు తరలించారు. పూర్తిగా విచారించి, వివరాలు సేకరించి వృద్ధుడిని రెడ్‌క్రాస్ హోమ్‌కు తరలించారు.

ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

మహారాణిపేట: మీ పరిధిలో ఎటువంటి వ్యాధులు సంభవించినా అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య సిబ్బందికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. చినవాల్తేరు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. పలు సర్వేల కోసం సిబ్బందితో చర్చించారు. నేషనల్ కమ్యూనికబుల్ డీసీజెస్(ఎన్‌సీడీ) 3.0 సర్వే, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, అభ ఐడీ మ్యాపింగ్ శత శాతం సాధించాలని డీఎంహెచ్‌వో సూచించారు. ఇప్పటి వరకు జరిగిన ఎన్‌సీడీ 3.0 సర్వేను ఆయన పర్యవేక్షించారు. యూపీహెచ్‌సీ పరిధిలో ఏ విధమైన వ్యాధులు సంభవించినచో తక్షణమే సంబంధిత వైద్యాధికారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి తెలియజేయాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దని సూచించారు.


పూర్తికాని వాటర్ ఫౌంటెయిన్ నిర్మాణం


అస్తవ్యస్తంగా చేపట్టిన పనులు

ముచ్చటగా మూడోసారి..!



- మరోసారి నిలిచిపోయిన టీటీడీ కూడలి ఆధునికీకరణ
- 8 నెలలుగా పనులు సాగదీస్తున్న కాంట్రాక్టర్
- ఎక్కడి నిర్మాణ సామగ్రి అక్కడే..
- పట్టించుకోని జీవీఎంసీ ప్రాజెక్ట్స్ అధికారులు



ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని టీటీడీ కూడలి ఆధునికీకరణ ముచ్చటగా మూడోసారి నిలిచిపోయింది. స్మార్ట్ సిటీ పనుల్లో భాగంగా జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం(ప్రాజెక్ట్స్) ఈ కూడలి అభివృద్ధి పనులు గతంలో చేపట్టింది. నగర వ్యాప్తంగా పలు ప్రధాన కూడళ్ల బ్యూటిఫికేషన్‌లో భాగంగా టీటీడీ కూడలిని సైతం ఆధునికీకరిస్తున్నారు. 8 నెలలుగా ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ క్రమంలో మూడు సార్లు పనులు నిలిచిపోయాయి. పనుల నిర్వహణలో జీవీఎంసీ ప్రాజెక్ట్స్ విభాగం అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

నిర్మాణ సామగ్రితో అధ్వానంగా కూడలి

నెల రోజుల వ్యవధిలో టీటీడీ కూడలి ఆధునికీకరణ పనులను మరోసారి నిలిపివేశారు. దీనికి తోడు ఈ పనుల కోసం కూడలిలో డంప్ చేసిన నిర్మాణ సామగ్రి, రాక్ బ్రిక్స్, కాంక్రీట్ పొడి ఎక్కడివి అక్కడే వదిలేయడంతో పారిశుధ్యం లోపించి అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సామగ్రి కారణంగా ట్రాఫిక్‌కు సైతం అంతరాయం ఏర్పడుతోంది. పనుల నిర్వహణలో కాంట్రాక్టర్ చూపుతున్న నిర్లక్ష్యం, అధికారుల ఉదాసీనతపై స్థానికులు, వాహన చోదకులు విమర్శలు గుప్పిస్తున్నారు. జీవీఎంసీ అధికారులు సత్వరమే ఈ పనుల పూర్తిచేసి సర్వాంగ సుందరంగా కూడలిని తీర్చిదిద్ది అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.

పనుల్లో అంతరాయం

దాదాపు రూ.కోటిపైగా వ్యయంతో టీటీడీ కూడలి ఆధునికీకరణ పనులు చేపట్టినట్లు గతంలో జీవీఎంసీ వెల్లడించింది. సర్కిల్ బ్యూటిఫికేషన్, గ్రీనరీ అభివృద్ధి, వాటర్ ఫౌంటెయిన్ నిర్మాణ పనులు చేపట్టారు. ఇందుకు అనుగుణంగా కూడలి లోపల కొత్త మట్టిని వేశారు. ఫౌంటెయిన్ నిర్మాణం కోసం వృత్తాకారంలో గోడలు కట్టారు. వాటి మధ్యలో పిల్లర్స్ సైతం నిర్మించారు. ఈ పనుల్లో నిత్యం అంతరాయం ఏర్పడటంతో ఆధునికీకరణ ఎప్పుడు పూర్తవుతుందోనే స్థానిక ప్రజల్లో సందేహం నెలకొంది.

రోడ్డు పక్కన మద్యం సీసాల గుట్ట


జాలరిపేటలో రోడ్డు పక్కన గుట్టగా పేర్చిన ఖాళీ మద్యం, బీర్ సీసాలు

ఏయూ క్యాంపస్: యువత మద్యానికి బానిసవుతున్నారనడానికి ఇది ఒక ప్రత్యక్ష ఉదాహరణ మాత్రమే. జాలరిపేటలో ఈ దృశ్యం 'సాక్షి' కంట పడింది. జాలరిపేట ప్రాంతంలో రాత్రి వేళల్లో తాగి పడేసే మద్యం సీసాలు, బీర్ బాటిళ్లను ఒక వ్యక్తి సేకరించి గుట్టగా పేర్చాడు. రోడ్డు పక్కనే ఉన్న ఇన్ని సీసాలను చూసిన వారు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇంత మద్యం తాగారా అంటూ నొసలు చిట్లిస్తూ వెళ్లిపోతున్నారు. రోడ్డు పక్కనే ఉన్న వేలాది మద్యం సీసాలు ప్రమాదకరమని గుర్తించిన పోలీసులు వీటిని అక్కడి నుంచి తొలగించాలని సదరు వ్యక్తికి సూచించారు. ఒక్కసారిగా అన్ని సీసాలను అక్కడి నుంచి తొలగించడం అతడి వల్ల అయ్యే పనిలా కనిపించడం లేదు. జాలరిపేటలోని నిర్మానుష్య ప్రాంతాలు మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నాయనడానికి ఇదొక ప్రత్యక్ష ఉదాహరణ మాత్రమే. బహిరంగ ప్రదేశాల్లో మద్య తాగడంపై పోలీసులు నిఘా ఉంచడం, కట్టడి చేయడం ఎంతో అవసరం. యువత పెడదోవ పట్టకుండా, మద్యానికి బానిసలు కాకుండా వారిలో పరివర్తన తీసుకువచ్చే దిశగా చర్యలు చేపట్టాలి.

29న ఫొటోగ్రఫీ తరగతులు

ఏయూక్యాంపస్: ఫొటోగ్రఫీపై ఆసక్తి గల వారికి ఈ నెల 29న ఫొటోగ్రఫీ తరగతులు నిర్వహిస్తున్నట్లు విశాఖ కెమెరా క్లబ్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపింది. బీచ్ రోడ్డులోని హవా మహల్‌లో ఆదివారం ఉదయం 6.30 నుంచి 8.30 గంటల వరకు శిక్షణ జరుగుతుందన్నారు. డిజిటల్ కెమెరాలను వినియోగించడం, మొబైల్ ఫోన్‌లో అత్యుత్తమ ఫొటోలను ఏ విధంగా తీయాలి అనే అంశాలను వివరిస్తారని చెప్పారు. ఫొటోగ్రఫీ ఒక హాబీగా కలిగిన వారికి, దీనిలో ఆసక్తి ఉన్న వారికి ఈ తరగతులు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు. 12 నుంచి 80 ఏళ్ల వయసు మధ్య గల వారు ఎవరైనా హాజరు కావచ్చని తెలిపారు. మొబైల్ ఫోన్ కెమెరాలు ఉపయోగించే వారికి సైతం శిక్షణ అందిస్తామన్నారు. ఈ తరగతులకు ఫొటోగ్రాఫర్ బి.కె.అగర్వాల్ మార్గదర్శనం చేస్తారని పేర్కొన్నారు. వివరాలకు 92466 23460, 94407 33358 నంబర్లలో సంప్రదించాలని కార్యక్రమ కమిటీ చైర్మన్ బి.కె.అగర్వాల్ కోరారు.


30న దర్శకుడు శ్యామ్ బెనగల్ సంస్మరణ సభ

మద్దిలపాలెం: బాలీవుడ్ సినీ దర్శక దిగ్గజం శ్యామ్ బెనగల్ సంస్మరణ సభను ఈ నెల 30న నిర్వహించనున్నట్లు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ప్రతినిధి ఎన్.ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సోమవారం సాయంత్రం 5 గంటలకు సభ జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా శ్యామ్ బెనగల్ దర్శకత్వం వహించిన చిత్రాన్ని ప్రదర్శిస్తామని, ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని చెప్పారు.

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

విశాఖ సిటీ: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ నాయకులు టి.శ్రీరామ్మూర్తి, జె.రవి గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అంబేడ్కర్ పేరు చెప్పడాన్ని ఫ్యాషన్‌గా చిత్రీకరిస్తూ, దానికి బదులుగా దేవుడి పేరు అన్నిసార్లు తలుచుకుని ఉంటే పుణ్యం వచ్చేదని, స్వర్గానికి వెళ్లేవారని కేంద్ర హోంమంత్రి పార్లమెంటులో అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండించారు. అమిత్ షా తప్పిదాన్ని ప్రధానమంత్రి సరిదిద్దాలని, కానీ సమర్థించడం చూస్తే కేంద్ర ప్రభుత్వ మనువాద దృక్పథం బయటపడిందన్నారు. బీజేపీకి మొదటి నుంచి రాజ్యాంగం మీద విశ్వాసం లేదన్నారు. అంబేడ్కర్‌ను అవమానించినందుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 75 ప్రకారం అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని రాష్ట్రపతిని కోరారు. అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా ఈ నెల 30న వామపక్ష పార్టీలు నిర్వహించనున్న ఆందోళనకు భారత నాస్తిక సమాజం మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

వేంకటేశ్వర వైభవంపై ఆధ్యాత్మిక ప్రవచనాలు


ప్రవచిస్తున్న విభీషణ శర్మ

ఎంవీపీకాలనీ: కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి మానవాళిని ఉద్ధరించడానికి వైకుంఠం నుంచి భూలోకానికి దిగి వచ్చారని ఆకెళ్ల విభీషణశర్మ అన్నారు. శ్రీ సుదర్శన సీతారామాచార్యులు నేతృత్వంలో ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని భద్రం పార్కు వేదికగా శ్రీవేంకటేశ్వర వైభవం ప్రవచనాల కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ఉదయగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఈ నెల 29 వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా విభీషణశర్మ చేసిన ఆధ్యాత్మిక ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ శ్రీ వేంకటేశ్వర స్వామి శోభాయాత్ర , గోవిందనామ పారాయణం అలరించాయి. నిర్వాహకులు కందాళ అరుణ గాయత్రి, డి.శ్రీనివాస్, వి.వి.ఆదినారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం బైక్ ర్యాలీ


ఆరిలోవలో బైక్ ర్యాలీ చేస్తున్న సీపీఎం నాయకులు


పిఠాపురం కాలనీలో బైక్ ర్యాలీ చేస్తున్న సీపీఎం నాయకులు

ఆరిలోవ: పెందుర్తిలో ఈ నెల 28, 29 తేదీల్లో జరగనున్న సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆరిలోవలో సీపీఎం నాయకులు గురువారం బైక్ ర్యాలీ చేపట్టారు. పాత డెయిరీఫారం వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ ఆదర్శనగర్, రవీంద్రనగర్, తోటగరువు, బాలాజీ నగర్, టీఐసీ పాయింట్, పాత పోలీస్ స్టేషన్, దుర్గాబజార్ మీదుగా ఆరిలోవ కాలనీ ఆఖరి బస్టాప్ వరకు సాగింది. సీపీఎం మహాసభలకు ఆరిలోవ ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలి రావాలని ర్యాలీలో ప్రచారం చేశారు. ఈ సభలకు జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు హాజరవుతారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాల గురించి వివరించడంతోపాటు సీపీఎం చేపట్టదలచిన ఉద్యమాల కార్యాచరణ గురించి వారు ఉపన్యాసం ఇస్తారన్నారు. కార్యక్రమంలో సీపీఎం ఆరిలోవ జోన్ నాయకులు కుమార్, శంకర్, నాగరాజు, సూర్యనారాయణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

మద్దిలపాలెం: ఈ నెల 28, 29 తేదీల్లో పెందుర్తిలో జరగనున్న సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం పార్టీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. పిఠాపురం కాలనీ నుంచి వెంకోజీపాలెం, ఎంవీపీ, ఉషోదయ జంక్షన్, వాల్తేరు మీదుగా మద్దిలపాలెం వరకూ ర్యాలీ సాగింది. సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్ మాట్లాడుతూ 400 మంది ప్రతినిధులతో బహిరంగ సభ జరుగుతుందన్నారు. ముఖ్య వక్తగా రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హాజరు కానున్నారని, అన్ని వర్గాల ప్రజలు సభలను విజయవంతం చేయాలని కోరారు.

మన సంప్రదాయం.. విదేశీయుల ఆశ్చర్యం



భారతీయుల కట్టుబాట్లు, సంప్రదాయాలు ఎంతో ప్రత్యేకం. ప్రకృతిని సైతం దైవంగా భావించి, పూజించే గొప్ప సంస్కృతి మన సొంతం. వీటిపై విదేశీయులు సైతం ఆసక్తి చూపడం, అనుసరించడం విరివిగా జరుగుతోంది. ఇటువంటి దృశ్యం గురువారం జాలరిపేటలో ఆవిష్కృతమైంది. సునామీ వచ్చిన రోజును తలచుకుంటూ మత్స్యకార మహిళలు ప్రతీ ఏటా డిసెంబర్ 26న సాగర తీరంలో పూజలు చేస్తున్నారు. దీని గురించి తెలుసుకున్న స్వీడన్‌కు చెందిన వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ ప్రత్యేకంగా విశాఖకు వచ్చారు. జాలరిపేట సముద్ర తీరంలో పూజలు చేస్తున్న విశాఖ మహిళల సంప్రదాయాలను, మన సంస్కృతిని తన కెమెరాలో బంధించే ప్రయత్నం చేశారు.

– ఏయూక్యాంపస్

ఎట్టకేలకు ఏనుగుల బొమ్మలకు మరమ్మతులు


బీచ్ రోడ్డులో ఏనుగుల బొమ్మలకు మరమ్మతులు చేస్తున్న కార్మికులు

ఏయూక్యాంపస్: పర్యాటకులను అమితంగా ఆకర్షించే బీచ్ రోడ్డులోని ఏనుగు బొమ్మలకు ఎట్టకేలకు మరమ్మతులు చేపట్టారు. వీటి అధ్వాన స్థితిపై ఇటీవల 'సాక్షి'లో ప్రచురించిన కథనాలకు అధికారులు స్పందించారు. విశాఖ మ్యూజియం ఎదురుగా ఉన్న ఈ ఏనుగుల బొమ్మలకు మరమ్మతులు చేసి, రంగులు వేసే పనులను ప్రారంభించారు. ప్రస్తుతం చిన్న ఏనుగు తొండం, తోక భాగాలను పునరుద్ధరించారు. దెబ్బతిన్న, విరిగిన భాగాలను పునరుద్ధరించి కొత్త వాటిలా కార్మికులు తీర్చిదిద్దుతున్నారు. కొద్ది రోజుల్లో ఇవి సరికొత్తగా పర్యాటకులను అలరించే అవకాశం ఉంది. చిన్నారులు ఇష్టంగా ఇక్కడ ఆడుకోవడం, ఫొటోలు తీసుకోవడం చేస్తుంటారు.

సాక్షి ఎఫెక్ట్..

పగటి పూట ఆగిన లైట్లు


శివాజీనగర్–2లో పగటి పూట ఆఫ్ చేసిన హైమాస్ట్ లైట్లు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు శివాజీనగర్–2లో విద్యుత్ లైట్లు ఎట్టకేలకు పగటి పూట ఆగాయి. ఈ కాలనీలో నెల రోజులుగా రాత్రి, పగలు తేడా లేకుండా నిరంతరం విద్యుత్ దీపాలు వెలుగుతూనే ఉండేవి. దీనివల్ల విద్యుత్ వృథా అయ్యేది. ఈ సమస్యపై గురువారం 'పగలే వెన్నెల' అనే శీర్షికన 'సాక్షి'లో వెలువడిన వార్తకు జీవీఎంసీ విద్యుత్ విభాగం అధికారులు స్పందించారు. విభాగం సిబ్బంది, కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సిబ్బంది ఉదయం 9 గంటలకు శివాజీనగర్ అంతా పరిశీలించి విద్యుత్ దీపాలు ఆపారు. తిరిగి సాయంత్రం 6 గంటలకు వెలిగించారు. వీధిలైట్ల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని, బల్బులు పోయిన చోట కొత్తవి వేసి వెలిగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా సీపీఐ శత వార్షికోత్సవాలు


భగత్‌సింగ్‌నగర్‌లో జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు


15వ వార్డులో జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

ఆరిలోవ: సీపీఐ శత వార్షికోత్సవాలను గురువారం ఆరిలోవ భగత్‌సింగ్‌నగర్‌లో పార్టీ నాయకులు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరించారు. జిల్లా నాయకుడు రెహమాన్ మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి 2025 డిసెంబర్ 26 వరకు ఏడాది పాటు ఉత్సవాలు జరుగుతాయన్నారు. స్వాతంత్య్రం రాక ముందు బ్రిటిష్ వారు ప్రజలపై అధిక భారాలు వేసి పాలించినట్టే.. దేశంలో బీజేపీ పరిపాలిస్తోందన్నారు. ప్రజా నాట్య మండలి, ఏఐవైఎఫ్ నాయకులు చిరంజీవి, సందీప్, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం

మద్దిలపాలెం: సీపీఐ శత వార్షికోత్సవాల సందర్భంగా 15వ వార్డు హెచ్‌బీ కాలనీలో సీపీఐ తూర్పు నియోజకవర్గ నాయకుడు, వార్డు ఇన్‌చార్జి పడాల గోవింద్ ఎర్రజెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వాలు సమాన హక్కులు కల్పించడానికి సీపీఐ అనేక పోరాటాలు చేసిందన్నారు. భారీగా పెంచిన పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరకుల ధరలు, విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలన్నారు. ఇల్లు లేని పేద కుటుంబాలకు ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ప్రజలకు కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసి ఆదుకోవాలని కోరారు. ప్రజా సమస్యలు పరిష్కారమయ్యే వరకు ప్రభుత్వాలపై పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎస్.మధురెడ్డి, రావి అశోక్, లక్ష్మణ్ రెడ్డి, శ్రీను కన్నారావు, రాము పాల్గొన్నారు.

వంగవీటి రంగా విగ్రహావిష్కరణ


ఆరిలోవ కాలనీలో విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు వెలగపూడి, వంశీకృష్ణ

ఆరిలోవ: ఉత్తరాంధ్ర రాధారంగ కాపు సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆరిలోవ కాలనీలో వంగవీటి మోహన్ రంగా 36వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరిలోవ ఆఖరి బస్టాప్ వద్ద రంగా విగ్రహాన్ని ముఖ్య అతిథులు తూర్పు, దక్షిణ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, సిహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ వంగవీటి రంగా బడుగు, బలహీన వర్గాల నాయకుడని, ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. అలాంటి మహానుభావుడు విగ్రహం ఏర్పాటు చేసిన సంఘ ప్రతినిధులను అభినందించారు.

ఇదిలా ఉండగా రంగా విగ్రహం ఆవిష్కరణకు రాజకీయ పార్టీలు, కులాలకు అతీతంగా 9వ వార్డు నుంచి 13వ వార్డు వరకు పలువురు నాయకులు అధిక సంఖ్యలో హాజరు కావడం విశేషం. కార్యక్రమంలో సంఘ నాయకులు పి.ధర్మారావు, ఎం.అప్పారావు, వై.సన్యాసిరావు, ఎం.రమణి, ఎం.మురళీమోహన్, పేపర్ నాయుడు, జి.మురళీ, బి.రాజా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మేళాకు విశేష స్పందన


వినియోగదారులతో కిటకిటలాడుతున్న డ్వాక్రా మేళా ప్రాంగణం

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ, మెప్మా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డ్వాక్రా ఉత్పత్తుల మేళా ఆకట్టుకుంది. ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా మైదానం వేదికగా నిర్వహిస్తున్న ఈ మేళాకు రెండో రోజు నగర వాసుల నుంచి విశేష స్పందన లభించింది. నగర పరిధిలోని డ్వాక్రా సంఘాల సభ్యులు ఈ మేళా ద్వారా వారు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నగర వాసులు పెద్ద ఎత్తున గురువారం కొనుగోళ్లు నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ యూసీడీ పీడీ సత్యవేణి మాట్లాడుతూ ఈ నెల 29 వరకు ఈ మేళా కొనసాగుతుందన్నారు. 100 స్టాల్స్ ద్వారా విక్రయాలు జరుగుతున్నాయని, 20 ఫుడ్ స్టాల్స్ కూడా అందుబాటులో ఉంచామని తెలిపారు. గురువారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.